క్లుప్తంగా

నవధాన్యాల సాగుతో భూసారం పెంపు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ ఎంటీ వరలక్ష్మి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు నవధ్యాన్యాలతో కూడిన పలు రకాల విత్తనాలు వేసవి దుక్కులలో వేసుకోవాలని చెప్పారు. తొలకరి జల్లులకు విత్తనాలు మొలకెత్తుతాయని ప్రధాన పంటవేసుకొనే 45రోజుల ముందు అవసరమైనంత వాడుకొని మిగిలిన దానిని పచ్చిరొట్ట ఎరువుగా దున్నించుకోవాలని తెలిపారు. దీనిద్వారా భూమి సారవంతమవుతుందన్నారు. అనంతరం రైతులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌డీఏ ఎ.మణి, ఐసీఆర్పీలు ఇర్ల వెంకటేశ్వర్లు, పెద్దారావు, తాటి శివనాగేశ్వరరావు, బి.రామారావు, పచ్చల ఐజాక్, పి.సీతారామ రాజు, వీఏఏ ప్రశాంతి పాల్గొన్నారు.

గాలిబాలి శాఖ గ్రంథాలయం తనిఖీ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖగ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ తనిఖీ చేశారు. గ్రంథాలయానికి వచ్చే వారి వివరాలు తెలిపే రిజిస్టర్లు, పుస్తకాలు తీసుకెళ్లేవారి వివరాలు తెలిపే రిజిస్టర్లు పరిశీలించారు. పుస్తకాలు ఉండే స్థలాన్ని పరిశీలించారు. గ్రంథాలయ నిర్వహణలో పుస్తకాలు పాడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సిబ్బందికి వివరించారు. గ్రంథాలయానికి ఎక్కువమంది వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట గ్రంథాలయాధికారి సత్యశిరీష, సిబ్బంది ఉన్నారు.

ఢిల్లీ ర్యాలీని జయప్రదం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు కోరారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో మంగళవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి గ్యాస్ పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచివేసిందని, ఎరువులు, విత్తనాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని అన్నారు. పంటకు కనీస మద్దతు ధర లేదని, కార్మిక చట్టాలను మార్చి కార్మికులను బానిసలుగా చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు పెట్టి రైతుల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సాంబయ్య, టి.రామారావు, కె.సుబ్బారావు, శ్రీనివాస్, వై.బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీని ప్రైవేటీకరించవద్దు

మంగళగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎల్ఐసీని అదానీకి కట్టబెట్టి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకోవాలని చూస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. ఎల్ఐసీ ప్రైవేటీకరణను ఆపాలని కోరుతూ నగరంలోని కొత్తపేటలో ఉన్న ఎల్ఐసీ కార్యాలయం వద్ద మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎల్ఐసీ నుంచి అదానీ దోచుకున్న ప్రజల సొమ్మును వెంటనే తిరిగి రాబట్టాలన్నారు. కార్యక్రమంలో సలీమ్, జీవన్ సాగర్, శ్రీనివాసరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటర్లు చోరీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పంటపొలాల్లో మరోసారి దొంగలు హల్‌చల్ చేసి మోటర్లు చోరీ చేసిన సంఘటనపై రైతులు మంగళవారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సేకరించిన వివరాల ప్రకారం పెనుమాక వైఎస్సార్ సెంటర్ వెనుక ఉన్న డొంక రోడ్డులో మేకా విశ్వనాథరెడ్డి, యడ్లపల్లి ప్రసాద్‌ల పంట పొలాల్లో ఉన్న విద్యుత్ మోటర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఉదయం పంట పొలానికి వెళ్లి పరిశీలించగా మోటర్ల వద్ద ఆటో వేసుకు వచ్చినట్లు గుర్తులు కనిపించాయి. దీంతో ఆటోలో వచ్చి దొంగతనం చేసినట్లు రైతులు నిర్ధారించుకుని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక్కో మోటార్ విలువ రూ.30 వేలు ఉంటుందని రైతులు తెలిపారు.

ముగిసిన ఉచిత మెడికల్ క్యాంప్

తాడేపల్లిరూరల్: కోరమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణా కెనాల్ గూడ్స్ షెడ్ వద్ద ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన కోరమండల్ లాజిస్టిక్ మేనేజర్ ప్రదీప్ మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. గూడ్స్ షెడ్ సిబ్బంది, హమాలీలు, లారీ ఓనర్స్, డ్రైవర్లకు వైద్యులు డాక్టర్ పి.విజయభాస్కర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అవేజ్ లిమిటెడ్ విజయవాడ మేనేజర్ ఎల్. స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- అవసరమైతే అదనంగా ట్యాంకర్లు కొనుగోలు చేసి సరఫరా చేయాలి
- అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయాలి
- నాణ్యతలో రాజీపడితే సహించేది లేదు
- అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే



రత్నాలచెరువు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. అవసరమైతే కొత్త ట్యాంకర్లు కొనుగోలు చేసి నీటి సరఫరా చేయాలని అన్నారు. మంగళవారం మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి ఏడు గంటల వరకు నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానికులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చిన తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం, పందులు, కుక్కల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను సూచించారు. సాంకేతిక కారణాల వల్ల పెన్షన్ ఆగితే సమస్యను వెంటనే పరిష్కరించి జూన్ నాటికి వారికి పెన్షన్ అందేలా చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. తొలుత రాజీవ్ గృహకల్ప కాలనీ వద్ద నిర్మాణం జరుగుతున్న చేనేత మగ్గం షెడ్లను పరిశీలించారు. ఈనెలాఖరుకు షెడ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులకు సూచించారు. అక్కడే నిర్మాణం జరుపుకుంటున్న పద్మశాలీయ, రజక కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలను పరిశీలించి కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం వెంటనే పూర్తి చేసి ఆయా సామాజికవర్గాలు శుభకార్యాలు జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రత్నాలచెరువు, కొండపనేని టౌన్‌షిప్‌లలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నగర పరిధిలోని ఆత్మకూరు గుంటూరు ఛానల్ వద్ద కల తాగునీటి పథకం ఆవరణలో నిర్మాణం జరుపుకుంటున్న తాగునీటి సంపు, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్ నిర్మాణాలను పరిశీలించారు. నగరంలో కోట్ల రూపాయలతో జరుగుతున్న పనుల నాణ్యతలో రాజీపడకుండా వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రత్నాల చెరువు, శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీల్లోని వార్డు సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్, అడ్మిన్ నిరంతరం పర్యవేక్షించి ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి తాగునీరు సరఫరా అయ్యేలా చేస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, డీఈ కృష్ణారెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డుతో రుణ సదుపాయం



దరఖాస్తులు పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీఏ మురళీకృష్ణ

ఫిరంగిపురం: పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుతో తక్కువ వడ్డీతో కూడిన రుణం లభిస్తుందని పశుసంవర్ధకశాఖ ఏడీఏ ఆలపాటి మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. పేషెంట్ రిజిస్టర్, ఏఐ రిజిస్టర్, మొబైల్ వాహనం ఓపీ రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం ఇప్పటివరకు కేసీసీ (కిసాన్ క్రెడిట్ కార్డుల) కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పశువైద్యశాల పరిధిలోని హౌస్‌గణేష్, వేములూరిపాడు, అమీనాబాద్, 113 తాళ్లూరు, శిరంగిపాలెం, తక్కెళ్లపాడుతోపాటు ఫిరంగిపురానికి చెందిన పాడి రైతుల నుంచి వంద వరకు కార్డుల కోసం దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వాటిని పరిశీలించిన తర్వాత జిల్లా డీఏహెచ్‌వో అధికారికి అందజేయనున్నట్లు తెలిపారు. వాటిని పరిశీలించి అర్హులైన వారిని గుర్తించి లీడ్ బ్యాంకు మేనేజర్‌కు అందజేస్తారని వారి వద్ద నుంచి సంబంధిత బ్యాంకులకు అనుమతితో కూడిన పత్రాలు వస్తాయని చెప్పారు. దీని ద్వారా అతి తక్కువ వడ్డీతో కూడిన రుణం అందజేస్తారన్నారు. పాడిగేదెల దాణా, షెడ్లు వేసేందుకు, గడ్డి, గడ్డి విత్తనాల కొనుగోలుకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. అనంతరం వైద్యశాలకు వచ్చిన ఐస్‌లైన్ రిఫ్రిజిరేటర్, బాటిల్ కూలర్లను పరిశీలించారు. వ్యాక్సిన్ పాడవకుండా ఉండేందుకు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఆయన వెంట పశువైద్యాధికారి కోటిరత్నం ఉన్నారు.

విలువలతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలు

బీఈఎంఎల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్ డైరెక్టర్ శివమకుటం



మాట్లాడుతున్న బీఈఎంఎల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్ డైరెక్టర్ శివమకుటం

మోతడక(తాడికొండ): ఉత్తమ విలువలతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించి కనిపెంచిన తల్లిదండ్రులకు, చదువుకున్న విద్యాసంస్థకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, బీఈఎంఎల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్స్ ఇండిపెండెంట్ డైరెక్టర్ శివమకుటం అన్నారు. తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్నోవేషనల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు వెళ్లినపుడు విద్యార్థులకు అవసరమైన పలు నైపుణ్యాలను ఆయన వివరించారు. ఇందులో భాగంగా ఇంటర్వ్యూ టిప్స్, గ్రూప్ డిస్కషన్స్, రెస్యూమ్ ప్రిపేరింగ్, వ్యవస్థాపక, ఇన్నోవేషన్ వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి రంగారావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు ఉపయోగకరంగా ఉంటాయని నిపుణులతో శిక్షణ అందిస్తున్నామన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పి బాలమురళీకృష్ణ, ఈసీఈ విభాగాధిపతి డి.నాగరవి కిరణ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెనుమూలి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ ఫాతిమా సానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆర్థిక సహాయాన్ని ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీలు బాధితురాలికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు షేక్ సల్మా, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ నజీర్, షేక్ బాజీ, షేక్ సుభాని, నాగూర్, సచివాలయ కన్వీనర్లు భీమవరపు కుసుమ, షేక్ మహబూబ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోడుగా ఎమ్మెల్యే ఆర్కే తోపుడు బండి అందజేత

దుగ్గిరాల మండలం పెనుమూలి గ్రామంలో ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఉండవల్లి శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే ఆర్కే అందజేసిన తోపుడు బండిని ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, దుగ్గిరాల మైనార్టీ విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ సుభాని, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

34 టన్నుల బియ్యం పట్టివేత

మేడికొండూరు: అర్ధరాత్రి అక్రమంగా బియ్యం తరలిస్తున్న లారీని మేడికొండూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ కేవీ కోటేశ్వరరావుకు అందిన సమాచారం మేరకు ఆయన సిబ్బందితో కలసి తనిఖీ చేపట్టారు. వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి గ్రామంలోని పద్మజ రైస్ మిల్లులో 34టన్నుల ప్రజా పంపిణీ బియ్యం లోడు చేసుకున్నారు. పేరేచర్లకు వస్తుండగా పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న గుజరాత్‌కు చెందిన సోమలాఖ్, వాగేలాకారా, భాయిలపై కేసు నమోదు చేశారు. తనిఖీలలో కానిస్టేబుళ్లు డేవిడ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలో ప్రధాన దళితవాడల మధ్య రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి రూ.20 లక్షలు కేటాయించడంతో పనులను అధికారులు ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి 15 లక్షల నిధులు కేటాయించి రజకపాలెంలో సీసీ రోడ్ నిర్మాణ పనులను ఎర్త్‌వర్క్ చేస్తున్నట్లు ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి తెలిపారు. త్వరలోనే ఈ పనులన్నింటికీ పూర్తిచేయనున్నట్లు ఆమె తెలిపారు.

మహిళను కాపాడిన ఎస్‌డీఆర్‌ఎఫ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను కాపాడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మంగళవారం సాయంత్రం ఒక మహిళ కృష్ణానది నుంచి దిగువకు వెళ్లే కెనాల్స్ సమీపంలో దూకింది. దీనిని చూసిన స్థానికులు దుర్గాఘాట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సమాచారమందించారు. వెంటనే వారు నదిలోకి బోట్‌ద్వారా వెళ్లి తాడు సాయంతో ఆమెను కాపాడి దుర్గాఘాట్ ఒడ్డుకు తీసుకొచ్చారు. ప్రథమచికిత్స చేసి ఆస్పత్రికి తరలించారు. ఆమె తాడేపల్లి గ్రామానికి ఉగ్గం విజయలక్ష్మిగా గుర్తించారు.

వడ్డీ రహిత రుణాలు పంపిణీ అభినందనీయం



రుణాలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర మైనార్టీస్‌ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఎండీ షేక్ షరీన్ బేగం

మంగళగిరి: చిరువ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఖిద్మత్ మ్యూచవల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ వడ్డీ రహిత రుణాలు అందజేయడం అభినందనీయమని రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఎండీ షేక్ షరీన్ బేగం కొనియాడారు. మంగళగిరిలోని మిద్దె సెంటర్‌లో కల కార్యాలయంలో చిరువ్యాపారులకు వడ్డీ రహిత రుణాలు పంపిణీ చేశారు. షరీన్ బేగం మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త ప్రవచనాలను పాటిస్తూ ఖిద్మత్ సొసైటీ చిరు, మధ్యతరగతి వ్యాపారులకు వడ్డీ రహిత రుణాలు అందించి వారికి ఆర్థిక భరోసా కల్పించగం సంతోషంగా వుందన్నారు. సామాజిక దృక్పథం కల మరింత మంది సంస్థలో చేరి తమ పొదుపు మొత్తాలను సొసైటీలో జమచేసి వడ్డీ రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఖిద్మత్ సొసైటీ ప్రతినిధులు షేక్ జాహిద్, నిజాం, అజీమ్, మగ్బూల్, బాబావలి, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు

గడపగడపకు మన ప్రభుత్వంలో సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



వెలగపూడి(తాడికొండ): అర్హతే ప్రామాణికంగా పేదవాడికి సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గతంలో రాజకీయ పార్టీలు ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలిచ్చి ఎన్నికల అనంతరం పేదలకు మొండిచేసి చూపించేవారని, ఆయా పార్టీలకు భిన్నంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన కొనసాగిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మెంబర్ కట్టిపోగు బసవయ్య, చలివేంద్రం సురేష్, ఆలోకం సురేష్, శృంగారపాటి సందీప్, రమణారెడ్డి, ఆరేపల్లి జోజి, నేలపాటి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల అదాలత్

మేడికొండూరు: డొకిపర్రు సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఉదయం విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ చల్లా రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని మేడికొండూరు ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లోని వినియోగదారులు ఈ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు.

17న బహిరంగ వేలం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం ఆక్టోపస్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వడ్డేశ్వరం ఆక్టోపస్ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీ ఉదయం 11 గంటలకు ఉపయోగంలో లేని 125 రకాల వస్తువులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని, ఈ వేలంలో పాల్గొనదలచిన వారు 9121102287 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వైద్య రంగంలో పెనుమార్పులు

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్యరంగాల్లో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి చేస్తున్నారని, శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులు నిర్వహించి అధునాతన పరికరాలు ఏర్పాటు చేస్తున్నారని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి అన్నారు. మంగళవారం దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి సలహా సంఘం సమావేశం జరిగింది. ఎంపీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌకర్యాలను, ఔషధాలను, రక్త నమూనా పరికరాలను పరిశీలించారు. సమావేశంలో వైద్యులు ఎం. ఇన్నారావు ఎం.కృష్ణవేణి, మహమ్మద్ అబ్దుల్ రహమాన్, సి.ఇందిర, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్) ఉయ్యూరు మారుతి వరప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది జానమ్మ, హిమాంబి, రాజు, కాజా, భాగ్యలలిత, రాజ్యం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Governorpet Branch, VIA వారి [illegible]

[illegible]

Regd. Post with Ack Due [illegible]

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., VIJAYAWADA.
Ph:9849431432

నులిపురుగుల నివారణతో రక్తహీనత దూరం



తుళ్లూరు మండలం రాయపూడి పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది



విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్ వేస్తున్న డాక్టర్ అనూష



ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ

రాయపూడి(తాడికొండ): చిన్నారుల్లో నులిపురుగుల కారణంగా వచ్చే రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తినిపించాలని రాయపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వల్లభాపురం ప్రసాద్ అన్నారు. మంగళవారం పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ చేతులు అపరిశుభ్రంగా ఉండటం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించని కారణంగా నులిపురుగులు నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తాయన్నారు. దుకాణాల్లో దొరికే జంక్ ఫుడ్స్, వేసవిలో అమ్మే చల్లని పదార్థాలు, ఐస్‌లు తినడం వలన అనేక జబ్బులు వస్తాయి కనుక చల్లదనానికి చిన్నారులను దూరంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ప్రారంభం

మంగళగిరి: విద్యార్థులు పరిశుభ్రత పాటించడంతోపాటు ఆరునెలలకోసారి తప్పనిసరిగా ఆల్బెండజోల్ టాబ్లెట్లు వేసుకోవాలని గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వీవర్స్ కాలనీలో కల ప్రభుత్వ ప్రైమరీ, ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ ఏడాది నుంచి 19 సంవత్సరాల వయస్సు కల విద్యార్థులు తప్పనిసరిగా ఏడాదికి రెండుసార్లు ఆల్బెండజోల్ టాబ్లెట్లు వేసుకోవడం వలన ఆరోగ్యంగా వుంటారన్నారు. పిల్లలలో జీర్ణప్రక్రియ సక్రమంగా జరగని కారణంగానే అనేక వ్యాధులు, జ్వరాలు వస్తాయన్నారు. జీర్ణప్రక్రియ సక్రమంగా జరిగి ఆరోగ్యవంతంగా ఉండాలనే ఏడాదికి రెండుసార్లు ఆల్బెండజోల్ టాబ్లెట్లు వాడడం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఉషాలక్ష్మి, శ్రీనివాస్, ఏఎన్ఎంలు ఝాన్సీ, విజయకుమారి, ఆశాలు లక్ష్మీకాంతం, తిరుపతమ్మ, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి పాల్గొన్నారు.

ఫిరంగిపురం: నులి పురుగుల నివారణతో రక్తహీనత దూరం అవుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండలకేంద్రంలోని శాంతిపేట ఎలిమెంటరీ పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భోజనం చేసే ముందుగా చేతులు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో సాల్మన్‌రాజు, ఎంపీహెచ్ఈవో లూర్దురాజు, ఎంఎల్‌హెచ్‌పీ మసూద్, ఏఎన్ఎం భారతీజ్యోతి, ఆశాకార్యకర్త రూత్‌హెలెన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరుడాచలపాలెంలో

స్థానిక మండల పరిషత్ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సుజాత, వజ్రకుమారి, హెచ్ఎం వై.సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని డాక్టర్ కేఆర్‌ఆర్ఎం డిగ్రీ కళాశాల, కేఎన్ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె. గిరిధరరావు మాట్లాడుతూ అధికంగా స్వీట్లు, చాక్లెట్లు, జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల నులి పురుగులు ఏర్పడతాయని, ఈ కారణంగా శరీరంపై దద్దుర్లు, విరేచనం సరిగ్గా కాకపోవడం, చికాకులు వస్తాయని విద్యార్థులకు వివరించారు. అనంతరం దుగ్గిరాల పీహెచ్‌సీ ఆశా వర్కర్ మాలతి ద్వారా 110 మంది విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సరళాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.రాంబాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



